PRGI NO: TGTEL/25/A2356

# మేకార్తి దినపత్రిక

మంగళవారం 24-03-2026 | పేజీలు : 6 | వెల రు : 4/- | సంపుటి : 1 సంచిక : 200 | WWW.MEKARTHI DINAPATRIKA.COM

జర్నలిస్టులకు ఆహ్వానం
నూతనంగా ప్రారంభించిన
మేకార్తి దినపత్రిక పత్రికలో
అన్ని జిల్లాలలో స్టాఫర్లుగా,మండలాల్లో విలేకర్లుగా పనిచేయుటకు
జర్నలిస్టులు కావలెను
సంప్రదించాల్సిన నెంబర్స్
9014726022,6302041083

# భారత్ చేరిన అమెరికా ఎల్పీజీ నౌక




- సరఫరా అంతరాయం: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల దేశంలో చమురు, ఎల్పీజీ (వ్రా+) సరఫరా గొలుసుకు ఆటంకం ఏర్పడి కొరత తలెత్తింది.
- అమెరికా నుంచి ఎల్పీజీ: భారత్‌కు ఊరటనిస్తూ అమెరికాలోని టెక్సాస్ నుంచి 'పయనీర్' అనే ఎల్పీజీ నౌక ఆదివారం కర్ణాటకలోని మంగళూరు పోర్టుకు చేరుకుంది.

పశ్చిమాసియా సంక్షోభం కారణంగా చమురు, ఎల్పీజీ సరఫరా గొలుసుకు అంతరాయం ఏర్పడింది. దీంతో దేశంలో ముఖ్యంగా ఎల్పీజీకి కొరత ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో భారత్‌కు ఊరటనిచ్చేలా అమెరికాకు చెందిన ఎల్పీజీ నౌక భారత్‌కు చేరింది. అమెరికాలోని టెక్సాస్ నుంచి బయల్దేరిన పయనీర్ నౌక ఎల్పీజీ లోడ్‌తో కర్ణాటకలోని మంగళూరు పోర్టుకు ఆదివారం చేరుకుంది. దీంతోపాటు రష్యాకు చెందిన చమురు నౌక కూడా దేశ సముద్రజలాల్లోకి ప్రవేశించింది. అక్వాటైటాన్ పేరుతో రష్యా నుంచి వచ్చిన ఈ నౌక శనివారమే మంగళూరు పోర్టును చేరినట్లు పలు ఆంగ్ల మీడియా సంస్థలు పేర్కొన్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా చమురు సంక్షోభాన్ని తగ్గించడమే లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మార్చి 12 నాటికి రష్యా నౌకల్లో లోడ్ చేసిన చమురును కొనుగోలు చేయొచ్చని అనుమతి ఇచ్చారు. ఈ నేపథ్యంలో రష్యా నౌక భారత్‌కు చేరుకోవడం గమనార్హం. పేజి 2లో ▶

# ఉద్రిక్తతల వేళ..

## కీలక భేటీ నిర్వహించనున్న ప్రధాని మోదీ



- కీలక భేటీ: పశ్చిమాసియా ఉద్రిక్తతల దృష్ట్యా ఇంధన కొరత తలెత్తకుండా ప్రధాని మోదీ సీనియర్ మంత్రులతో అత్యవసర సమావేశం నిర్వహించనున్నారు.
- ప్రధాన రంగాలు: ముఖ్యంగా పెట్రోలియం, ఎరువులు, మరియు విద్యుత్ రంగాలకు చెందిన మంత్రులతో ఈ సమీక్ష జరగనుంది.

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ ప్రధాని మోదీ సీనియర్ మంత్రులతో కీలక భేటీ నిర్వహించనున్నారు. ముఖ్యంగా పెట్రోలియం, ఎరువులు, విద్యుత్ రంగాలకు చెందిన మంత్రులతో సమీక్ష జరపనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా ఇంధనం నిరంతరాయంగా సరఫరా చేయడం, సరకు రవాణాలో ఇబ్బందులు లేకుండా చూడటమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమని తెలిపాయి. వినియోగదారులు, పరిశ్రమల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్రం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.పశ్చిమాసియాలో యుద్ధం ప్రపంచ ఇంధన సంక్షోభానికి దారితీసిందని ప్రధాని మోదీ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. ఇది భారత్‌కు ఓ కీలక పరీక్షగా మారిందని.. శాంతి, సహనంతో ఈ పరిస్థితులను ఎదుర్కోవాలని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ సరఫరా గొలుసులో ఏర్పడిన అంతరాయాలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తోందన్నారు.

## ఆర్సెల్లార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్..

### ఉత్తరాంధ్రకు మరో మణిహారం: కలిశెట్టి



2లో..

## లారీని ఢీకొట్టిన కారు.. భార్యాభర్తలు మృతి



2లో..


# సిద్దిపేటలో గెలిచిన వారికి మంత్రి పదవి: సీఎం రేవంత్‌రెడ్డి

రైతు భరోసా నిధుల విడుదల: రాష్ట్రవ్యాప్తంగా 1.50 కోట్ల ఎకరాలకు పెట్టుబడి సాయం అందించేందుకు రూ. 9,000 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో భాగంగా తొలి విడతగా రూ. 3,590 కోట్లను సీఎం విడుదల చేశారు.
సోమవారం నుంచి ఇవి రైతుల ఖాతాల్లో జమ అవుతాయి.



నర్మెట: ఎన్ని ఇబ్బందులు ఉన్నా.. రైతు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా నిధులను ఆయన విడుదల చేశారు. ఈ పథకం కింద 1.50 కోట్ల ఎకరాలకు సాయం అందించేందుకు రూ.9 వేల కోట్లను ప్రభుత్వం సమకూర్చింది. సిద్దిపేట జిల్లా నర్మెటలో నిర్వహించిన సభలో తొలి విడతగా రూ.3,590 కోట్లు విడుదల చేశారు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం అన్నదాతల ఖాతాల్లో జమవుతాయని చెప్పారు. ఇరవై రోజుల అనంతరం రెండో విడతలో రూ.2,650 కోట్లు, మూడో విడతలో రూ.2,760 కోట్లు విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఆర్థిక సమస్యలు ఇబ్బంది పెడుతున్నా.. రైతుల విషయంలో వెనుకంజ వేయడం లేదన్నారు. "వరికి బోనస్ ఇస్తున్నాం. వరదల వల్ల నష్టపోతే పరిహారం ఇస్తున్నాం. రైతుల కోసం ఇప్పటివరకు రూ.1.40 లక్షల కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్రంలో పంటల విధానంలో మరిన్ని మార్పులు రావాలి. గతంలో రంగారెడ్డి జిల్లాలో కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు బాగా పండించేవారు. 2 లో

## మమత కంచుకోట.. ఒకప్పుడు కాంగ్రెస్‌దే హవా!



పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల హడావుడి నెలకొంది. ఈ క్రమంలోనే భవానీపుర్ నియోజకవర్గం అందరి దృష్టి ఆకర్షిస్తోంది. పేజి 2లో ▶

## పాలనలో.. మోదీ రికార్డు



# పోలవరం ఎమ్మెల్యేను బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు

పోలవరం: ఏపీలోని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. ఆయన బ్యాంకు అకౌంట్ నుంచి రూ.12 లక్షలు కాజేశారు. ఆర్టీఏ చలానా పేరుతో వచ్చిన లింక్‌ను ఎమ్మెల్యే క్లిక్ చేశారు. దీంతో బ్యాంకు ఖాతాలోని నగదు మాయమైంది. మోసపోయినట్లు గ్రహించిన ఎమ్మెల్యే బాలరాజు.. జీలుగుమిల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



## హైదరాబాద్‌లో బాల్కనీ స్లాబ్ కూలి ఇద్దరి మృతి

పంజాగుట్ట: బాల్కనీ స్లాబ్ కూలి ఇద్దరు మృతిచెందిన ఘటన పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంబాగ్‌కు చెందిన దేవీదాస్ (56), అతడి అల్లుడు వరుసైన వివేక్ (32)లు ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నారు.



2లో..

# 25న కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తా: జీవన్‌రెడ్డి

- రాజీనామా ప్రకటన: ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయబోతున్నట్లు జీవన్ రెడ్డి అధికారికంగా వెల్లడించారు.
- మానసిక క్షోభ: గత 20 నెలలుగా పార్టీలో తీవ్రమైన మానసిక వేదనను అనుభవిస్తున్నానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
- అవమానాలపై అసహనం: వరుసగా ఎదురవుతున్న అవమానాలను భరిస్తూ పార్టీలో కొనసాగడం ఇక తన వల్ల కాదని స్పష్టం చేశారు.

2లో..



# అన్నదాత సంతోషం కోసం అన్నగా బాధ్యత తీసుకున్నా: సీఎం రేవంత్



హైదరాబాద్: రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతుల కోసం రూ.9వేల కోట్ల 'రైతు భరోసా' నిధులను నేడు విడుదల చేయనున్నట్లు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి (=వఝుత్ష్ట్ర =వఽఽఎ) తెలిపారు. సిద్దిపేట జిల్లా నర్మెట వేదికగా దీనికి శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో రేవంత్ పోస్ట్ చేశారు.

"అన్నదాత సంతోషం కోసం అన్నగా బాధ్యత తీసుకున్నా. రైతును ధైర్యంగా సాగు మడిలో నిలబెట్టేందుకు భరోసా ఇస్తున్నా. 70 లక్షల మంది రైతన్నల కోసం రూ.9000 కోట్ల రైతు భరోసా నిధుల విడుదలకు నేడు శ్రీకారం చుడుతున్నాం. సిద్దిపేట జిల్లా నర్మెట వేదికగా మరోసారి మా పాలనలో రైతే రాజు అని రుజువు చేస్తూ పథకాన్ని అమలు చేస్తున్నాం. ఆర్థిక సాయంతో చేతులు దులుపుకోవడం కాదు.. కేవలం 17 నెలల వ్యవధిలో పామాయిల్ పరిశ్రమ మొదలు పెట్టి, పూర్తి చేసి నేడు రైతు లోకానికి అంకితం చేస్తున్నాం. దానికి కొనసాగింపుగా రిఫైనరీ యూనిట్‌కు శంకుస్థాపన చేస్తున్నాం" అని సీఎం పేర్కొన్నారు.

# సంపాదకీయం

## పశ్చిమాసియా సంక్షోభంలో మహాపరాధులు

'మానవ వ్యవహారాలలో దుష్టశక్తుల పాత్రపై మీరు మరి కొంచెం ఎక్కువగా ఆలోచించాలి...'-- ఇటీవల కీర్తిశేషుడు అయిన ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ఆంద్రే బెటీల్ ఒక వ్యక్తిగత లేఖలో నాకు అలా సూచించారు. నేను నా రచనా వ్యాసంగంలో గాంధీ లాంటి సజ్జనులు, సత్ సంకల్పుల మీదనే దృష్టిని కేంద్రీకరిస్తున్నానని ఆయన భావించారు. అయితే సజ్జనుల కంటే ఎక్కువగా చరిత్రను దుష్టస్వభావులే సృష్టిస్తున్నారు, నిర్మూలిస్తున్నారు. ఇది నిజం. పశ్చిమాసియాలో ప్రస్తుత యుద్ధం ప్రజ్వరిల్లినప్పుడు ప్రొఫెసర్ బెటీల్ సూచన నాకు జ్ఞప్తికి వచ్చింది. ఈ యుద్ధంలో అమెరికా, ఇజ్రాయెల్ కలిసికట్టుగా ఇరాన్‌పై పోరాడుతున్నాయి. ఈ వినాశనకర ఘర్షణకు ప్రధాన కారకులైన ఆ మూడు దేశాల నాయకుల వ్యక్తిత్వాలను యుద్ధం ఎలా సువ్యక్తం చేసిందో నిశితంగా పరిశీలించడం చాలా ముఖ్యం.

తొలుత, యుద్ధం తొలిరోజునే మరణించిన ఇరాన్ అధినేత అయతొల్లా ఖమేనీ విషయాన్ని చూద్దాం. బాంబుల వర్షం కురుస్తున్నా సురక్షిత ప్రదేశానికి వెళ్లడానికి ఖమేనీ నిరాకరించాడు. ఉద్దేశపూర్వకంగా మరణాన్ని ఆహ్వానించాడు. తన అంతిమ రోజుల్లో ఖమేనీ ప్రదర్శించిన ధైర్యం ఆయన నైతిక ఉన్నతికి తార్కాణం. ఈ కారణంగా ఖమేనీని సామ్రాజ్యవాద వ్యతిరేక యోధుడుగా వామపక్ష మేధావులు కొంతమంది కీర్తిస్తున్నారు. ఖమేనీ వీరోచితంగా మరణించాడు, సందేహం లేదు. అయితే ఇది, ఆయన సజీవుడుగా ఉన్నప్పుడు తన అపార అధికారాలను ఏ విధంగా ఉపయోగించారు అన్న వాస్తవాన్ని అస్పష్టపరచకూడదు.

ఇరాన్ సర్వాధినేతగా ఖమేనీ ముందు మూడు మార్గాలు ఉన్నాయి. అవి, తన ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకు ప్రతిస్పందించి, రాజకీయ ప్రక్రియల నుంచి మతాచార్యులను ఉపసంహరించి, స్వేచ్ఛాయుత సమాజాన్ని అభివృద్ధిపరచడం. మహిళలపై విధించిన అన్ని ఆంక్షలను తొలగించి దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ జీవితంలో వారిని పూర్తిగా భాగస్వాములను చేసి ఉండవలసింది. ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా తదితర గల్ఫ్ దేశాలకు ఉన్నట్టుగానే ఇరాన్‌కు అపార చమురు నిక్షేపాలు ఉన్నాయి. ఆ దేశాలలో లేని విధంగా ఇరాన్‌లో విద్యాధికులు అధికంగా ఉన్నారు. 1979 ఇస్లామిక్ విప్లవానికి ముందు కాలంలో ఇరానియన్ మహిళలు విద్యారంగంలోనూ, వివిధ వృత్తులలోను కీలక బాధ్యతలు నిర్వహిస్తూ ఉండేవారు. గల్ఫ్ దేశాలకు లేని సమున్నత సాంస్కృతిక చరిత్ర ఇరాన్‌కు ఉన్నది. పురాతన నాగరికతకు నెలవైన ఇరాన్ నుంచి చాలామంది సుప్రసిద్ధ తాత్వికులు, మహాకవులు, సంగీతవేత్తలు ప్రభవించారు. సంపద్వంతమైన స్వావలంబన ఇరాన్‌ను నిర్మించేందుకు ఆ సముదాత్త చరిత్రను ఖమేనీ ఉపయోగించుకుని ఉండవల్సింది.

అధికారంలో ఉన్న సుదీర్ఘకాలంలో ఆర్థికాభివృద్ధితో పాటు ప్రజాస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఖమేనీ కృషిచేసి ఉండవల్సింది. లేదూ, సింగపూర్ తరహాలో ప్రజాస్వామ్య పురోగతిని ఉపేక్షించి ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యమిచ్చి ఉండవలసింది. అయితే ఈ రెండు మార్గాలకు భిన్నంగా ఖమేనీ పాలన మూడో మార్గాన్ని అనుసరించింది. స్వదేశంలో ప్రజలపై తీవ్ర అణచివేత విధానాలను అమలుపరిచింది. వైదేశిక నీతిలో విస్తరణవాదానికి ప్రాధాన్యమిచ్చింది. లెబనాన్, యెమెన్‌లో తనకు అనుకూలంగా ఉండే సాయుధ బృందాలను ప్రోత్సహించింది. సిరియాలో అస్సాద్ క్రూరపాలనకు మద్దతునిచ్చింది. తద్వారా ఆ దేశాలు అతలాకుతలమవడంలో కీలక పాత్ర వహించింది. మరీ ముఖ్యంగా ఖమేనీ నేతృత్వంలో ఇరాన్ దురహంకారపూరితంగా ఇస్లామిక్ ప్రపంచానికి తనకుతాను నాయకుడుగా నిర్దేశించుకున్నది. యూదు రాజ్యమైన ఇజ్రాయెల్ పట్ల వ్యతిరేకతను ప్రదర్శించింది.

ఇజ్రాయెల్‌ను సుదీర్ఘకాలంగా పరిపాలిస్తున్న బెంజమిన్ నెతన్యాహు సైతం ఖమేనీ వలే మత తీవ్రవాది. ఎటువంటి దయాదాక్షిణ్యాలు లేకుండా వ్యవహరించే వ్యక్తి. కుటుంబ నేపథ్యమే నెతన్యాహును యూదు మత తీవ్రవాదిగా మార్చింది. తండ్రి కరడుగట్టిన మితవాద యూదు చరిత్రకారుడు. సైనికాధికారిగా ఉన్న సోదరుడు 1976లో ఉగ్రవాదుల చెర నుంచి ఇజ్రాయెలీలను విడిపించడంలో ప్రాణాలు కోల్పోయిన వీరుడు. ప్రధానమంత్రిగా నెతన్యాహు, పాలస్తీనియన్లకు స్వతంత్ర దేశం ఏర్పాటును ఎటువంటి మినహాయింపులు లేకుండా వ్యతిరేకిస్తూ వస్తున్నారు. పాలస్తీనియన్ అథారిటీ పట్ల అతడి అణువణువులో అపార ద్వేషమున్నది. ఆ సంస్థ ప్రాబల్యాన్ని తగ్గించేందుకు ఒక దశలో హమాస్‌కు సైతం అతడు మద్దతునిచ్చాడు. అక్టోబర్ 2023లో ఇజ్రాయెల్‌పై హమాస్ దాడికి నెతన్యాహు చాలా పైశాచికంగా ప్రతిస్పందించాడు. ఇజ్రాయెల్ సైన్యం గాజాలో 75 వేల మందికి పైగా పౌరులను హతమార్చింది. లక్షలాది ఇజ్రాయెలీలను నిరాశ్రయులను చేసింది. ఈ చర్యలకుగాను అంతర్జాతీయ నేర విచారణ న్యాయస్థానం నెతన్యాహుపై యుద్ధ నేరస్థుడుగా అభియోగం మోపింది. నిజానికి అతడిని ఆ విధంగానే పరిగణించితీరాలి. నెతన్యాహు, ఆయన కుటుంబ సభ్యులపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. అధికారంలో కొనసాగాలంటే వాటి అడ్డు తొలగించుకోవాలి. అందుకే ఇరాన్‌కు వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రేరేపించి, కొనసాగిస్తున్నాడని నెతన్యాహును పలువురు నిందిస్తున్నారు.

పశ్చిమాసియా యుద్ధంలో మూడో ప్రధాన వ్యక్తి డోనాల్డ్ ట్రంప్ విషయమేమిటి? అధికార లాలసే ఈయననూ నడిపిస్తున్నది. క్రైస్తవ ధర్మాన్ని పరిపూర్ణంగా అనుసరించే వ్యక్తినని ట్రంప్ చెప్పుకుంటాడు. అయితే ఆ ధర్మం నిర్దేశించిన దివ్య ప్రవర్తనా నియమావళిని ఈ మహాశయుడు పాటించడు. ఈ శతాబ్ది మొదటి దశకంలో డెమొక్రాటిక్ పార్టీ సభ్యుడుగా ఉన్న ట్రంప్ ఆ తరువాత 2016లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా అమెరికా అధ్యక్షపదవికి ఎన్నికయ్యాడు. 2024లో యుద్ధ వ్యతిరేకత నినాదంతో రెండోసారి అధికారంలోకి వచ్చిన ట్రంప్ నైజీరియా, సోమాలియాలపై బాంబు దాడులకు ఆదేశించాడు. వెనెజువెలా అధ్యక్షుడిని కిడ్నాప్ చేసి అమెరికా జైలులో నిర్బంధించాడు.

ఆ తరువాత ఇరాన్‌పై పెద్ద ఎత్తున సైనిక దాడులు ప్రారంభించాడు. వీటిలో ఏ ఒక్క దేశం నుంచి కూడా అమెరికాకు వాటిల్లే ముప్పు ఏమీ లేదు. శాంతి ప్రియుడినని చెప్పుకున్న ట్రంప్ యుద్ధోన్మాదిగా వ్యవహరిస్తున్నాడు. ట్రంప్ సైద్ధాంతిక వ్యక్తి కాదు. అతడి నిర్ణయాలకు, చర్యలకు మార్గనిర్దేశం చేసేది స్వప్రయోజనాలే. అధికారలాలసతో పాటు అతడిని ఉత్సాహపరిచేవి దురాశ, అహంకారాలే. ఇరాన్‌పై ప్రస్తుత అమానుష దాడిని అమెరికా ఎందుకు ప్రారంభించింది అనే దానికి సహేతుక, తార్కిక, విశ్వసనీయ కారణాలను కనుగొనడం కష్టం. ఇరాన్‌పై యుద్ధానికి వెళ్లడాన్ని ట్రంప్ సమర్థించుకుంటూ, ఆయన తడవకో కారణం చెబుతున్నాడు. అవి పరస్పర విరుద్ధంగా ఉంటున్నాయి. నిజమైన కారణాలు ఏమై ఉండవచ్చు? వీటిపై అనేక ఊహాగానాలు. బరాక్ ఒబామా ప్రభుత్వం ఒసామా బిన్ లాడెన్‌ను తుదముట్టించి అమెరికా ప్రజల మెప్పు పొందినట్టే, ఖమేనీని హతమార్చి, స్వదేశీయుల నుంచి మరింత ఘనమైన ప్రశంసలు పొందాలనే ఆకాంక్షే ఈ యుద్ధానికి ట్రంప్‌ను ప్రేరేపించిందన్నది నేను విన్న ఆ ఊహాగానాలలో ఒకటి. గాజాలో ఒక 'రివియెరా' (సముద్ర తీరంలో విలాసవంతమైన పర్యాటక కేంద్రం)ను అభివృద్ధిపరచడం ద్వారా కుటుంబ సిరి సంపదలను ఇతోధికంగా పెంపొందించుకోవాలనే పేరాశతోనే ఇరాన్‌కు వ్యతిరేకంగా, నెతన్యాహు అభీష్టాన్ని నెరవేర్చేందుకు ట్రంప్ సమ్మతించాడని మరి కొందరు వాదిస్తున్నారు. ఇరాన్‌కు వాటిల్లే భారీ విధ్వంసం, ఇరానియన్ల అష్టకష్టాలు చూసి ఆనందించాలనే దుగ్ధ ఉండవచ్చు. ఇరాన్ చమురు నిక్షేపాలు, పెట్రోలియం ఉత్పత్తుల సదుపాయాలను స్వాధీనం చేసుకుని వాటిని తన ఆశ్రితులకు అప్పగించడం మరో లక్ష్యం.

దురహంకారం, దురాశల హానికరమైన కలయికతోనే ఇరాన్‌కు వ్యతిరేకంగా భయంకరమైన యుద్ధానికి ట్రంప్ ఆదేశించారు. పోటెత్తిన ఈ దౌష్ట్యానికి ఖమేనీ ప్రభుత్వాన్ని సమర్థిస్తున్న వారితో పాటు వ్యతిరేకిస్తున్న ఇరానియన్లు కూడా ఒకేరీతిలో నలిగిపోతున్నారు. నివాస ప్రదేశాలు, దుకాణాలు, కార్యాలయాలు, చరిత్రాత్మక భవనాలు, సాంస్కృతిక కేంద్రాలపై విచక్షణారహిత భయానక దాడులలో వేలాది ఇరానియన్లు హతమయ్యారు. లక్షల సంఖ్యలో అమాయకులు నిరాశ్రయులయ్యారు. లెబనాన్ లోని పలు పట్టణాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో లక్షలాది ప్రజలు ఆప్తులు, ఆస్తులు కోల్పోయి అల్లాడిపోతున్నారు. పశ్చిమాసియా సమస్తం అతలాకుతలమైపోతోంది. చమురు మార్కెట్లు ఇప్పటికే కుదేలయిపోయాయి. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తరువాత సంభవించిన అతిపెద్ద ప్రపంచ సంక్షోభమే ఇరాన్‌పై అమెరికా-- ఇజ్రాయెల్ యుద్ధం.

ఈ భయంకర సంఘర్షణను ప్రారంభించిన, ఎగదోస్తున్న వారిలో మంచి మనుషులు ఎవరూ లేరు. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా నాయకులు అందరూ పాపకర్ములే. అమాయకులను నిర్దయగా హతమార్చేందుకు, ఎదుటి పక్షం వారి బతుకులను నరకప్రాయం చేసేందుకు వెనుకాడని దుష్టులే.

# పాలనలో.. మోదీ రికార్డు

మొదటి పేజీ తరువాయి

తన రాజకీయ జీవితంలో ప్రధాని మోదీ (గ్రావీ చీఘీతీవఅంతీఘ వీశీఅఱ) మరో అరుదైన మైలురాయిని చేరుకున్నారు. 8,931 రోజుల పాటు (గుజరాత్ సీఎం పదవీకాలం సహా) ఎలాంటి విరామం లేకుండా దేశంలో సుదీర్ఘకాలం ప్రభుత్వ అధిపతిగా పనిచేసిన వ్యక్తిగా నిలిచారు. ఇప్పటి వరకు సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న ఈ రికార్డును మోదీ అధిగమించారు. చామ్లింగ్ సిక్కిం ప్రభుత్వ అధిపతి (ముఖ్యమంత్రి)గా 8,930 రోజులు పనిచేశారు.

2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మోదీ 2014లో ప్రధానమంత్రి అయ్యే వరకు ఆ పదవిలో ఉన్నారు. అప్పటినుంచి నేటి వరకు ప్రధానిగా కొనసాగుతున్నారు.

గుజరాత్‌కు అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా మోదీ నిలిచారు. అంతే కాకుండా ముఖ్యమంత్రిగా ఎక్కువ అనుభవమున్న ప్రధాని కూడా ఆయనే.

స్వాతంత్ర్యానంతరం జన్మించి, దీర్ఘకాలం ప్రధానిగా ఉన్న కాంగ్రెసేతర తొలి నేత కూడా మోదీయే. కేంద్రంలో రెండుసార్లు పూర్తి పదవీకాలాన్ని పూర్తిచేసుకొని, మూడోసారి అధికారం చేపట్టిన కాంగ్రెసేతర పార్టీ నేతగా రికార్డు నెలకొల్పారు.

వరుసగా 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో తన పార్టీని మోదీ విజయపథంలో నడిపించారు. దీంతో మూడు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని సాధించిన నెహ్రూ రికార్డును సమం చేశారు.

గతేడాది జులైలో మోదీ.. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ రికార్డును అధిగమించి వరుసగా దేశంలో అత్యధిక కాలం పనిచేసిన రెండో ప్రధానిగా నిలిచారు.

వరుసగా ఆరు ఎన్నికల్లో ఒక పార్టీ పక్ష నేతగా ఎన్నికైన ఏకైక నేత నరేంద్రమోదీ. 2002, 2007, 2012లలో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి సీఎం అయ్యారు. 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో నెగ్గి ప్రధాని అయ్యారు.

# లారీని ఢీకొట్టిన కారు.. భార్యాభర్తలు మృతి

మొదటి పేజీ తరువాయి

పూతలపట్టు: చిత్తూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతిచెందారు. చిత్తూరు-తిరుపతి హైవేపై ఆదివారం వేకువజామున ఈ ఘటన చోటుచేసుకుంది. ముందువెళుతున్న లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో కారులోని భార్యాభర్తలు సతీశ్, భాగ్యలక్ష్మి అక్కడికక్కడే మృతిచెందారు. అదే కారులో ప్రయాణిస్తున్న కుమారుడు సుశాంత్, కుమార్తె పావని, డ్రైవర్ ప్రదీప్ సురక్షితంగా బయటపడ్డారు. కర్ణాటకలోని మండ్యకు చెందిన వీరంతా తిరుమలకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

## శత్రు నౌకలు మినహా అన్నీ వెళ్లొచ్చు! - ఇరాన్



హర్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తెరవాల్సిందేనని, లేదంటే విద్యుత్ కేంద్రాలపై దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ స్పందించింది. శత్రు దేశాలకు చెందినవి మినహా అన్ని నౌకలు తమతో సమన్వయం చేసుకుంటూ హర్మూజ్ ద్వారా వెళ్లొచ్చని పేర్కొంది. ఈ మేరకు ఐరాసలోని ఇంటర్నేషనల్ మారిటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంవో)లో ఇరాన్ సీనియర్ ప్రతినిధి అలీ మౌసావి ఈ విషయాన్ని వెల్లడించారు. హర్మూజ్‌లో ప్రస్తుత పరిస్థితికి అమెరికా, ఇజ్రాయెల్‌లు ప్రధాన కారణమని మౌసావి ఆరోపించారు. దౌత్యానికి ఇరాన్ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని, అయినప్పటికీ.. దురాక్రమణ నిలిపివేయడం, పరస్పర విశ్వాసం ఎంతో ముఖ్యమన్నారు. నావికుల రక్షణ, సముద్ర భద్రతను మెరుగుపరచడానికి ఐరాస విభాగమైన ఐఎంవోకు సహకరించేందుకు ఇరాన్ సిద్ధంగా ఉందన్నారు. ఇదిలాఉంటే, హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవకుంటే.. ఇరాన్‌లోని పలు విద్యుత్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటామని ట్రంప్ హెచ్చరించారు. అతిపెద్ద విద్యుత్ కేంద్రంతోనే ఈ దాడులు ఆరంభిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఇరాన్ నుంచి ఈ స్పందన రావడం గమనార్హం.

# సిద్దిపేటలో గెలిచిన వారికి మంత్రి పదవి: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల ఆ జిల్లాలో పంటల సాగు తగ్గింది. కూరగాయలు, పండ్లు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. కేంద్రం 50 లక్షల టన్నుల వరి మాత్రమే కొంటామని చెప్తోంది. పంటమార్పిడి ద్వారా మాత్రమే.. వ్యవసాయం లాభసాటి అవుతుంది.

### అంకాపూర్‌ను ఆదర్శంగా తీసుకోండి

సిద్దిపేటలో నిర్మించిన ఫ్యాక్టరీ కొడంగల్‌లోనూ నిర్మించాలని మంత్రి తుమ్మలకు విజ్ఞప్తి చేస్తున్నా. నిజామాబాద్ జిల్లాలోని అంకాపూర్ రైతులను ఆదర్శంగా తీసుకొని రైతులంతా ముందుకెళ్లాలి. తెలంగాణలో ఒక్కో జిల్లా.. ఒక్కో పంటకు ప్రసిద్ధి. రాష్ట్రంలో సారవంతమైన భూములున్నాయి.. కష్టపడే రైతులు ఉన్నారు. మన పంటలను ఎగుమతి చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది. రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని నిర్ణయించాం. మహిళలను వ్యాపారులుగా తీర్చిదిద్దుతున్నాం. ఒకప్పుడు సౌరవిద్యుత్ వ్యాపారం అంబానీ, అదానీ వంటివారు చేసేవారు. ఈ ప్రభుత్వం మహిళలతో సోలార్‌ప్లాంట్లను ఏర్పాటు చేయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచే ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టాం. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు.. ఉదయం టిఫిన్ కూడా పెడుతున్నాం.

### సిద్ధిపేటలో గెలిచిన వారికి మంత్రి పదవి

పశ్చిమాసియాలో యుద్ధం వల్ల మనకు రాబోయే రోజుల్లో యూరియా కొరత వచ్చేలా ఉంది. రామగుండం ఫ్యాక్టరీ యూరియా అంతా మనకే దక్కేలా భాజపా ఎంపీలు సహకరించాలి. ఎన్నికలు ఉన్నప్పుడే రాజకీయాలు చేద్దాం. ఎన్నికలు లేనప్పుడు ప్రాంతాల అభివృద్ధి కోసం పరస్పరం సహకరించుకోవాలి. ప్రత్యర్థి పార్టీ నేతల గురించి ఆలోచిస్తే.. ప్రజలకు అన్యాయం జరుగుతుంది. ప్రజలకు ఇచ్చే నిధుల విషయంలో వివక్షచూపే సీఎంను కాదు. వచ్చే ఎన్నికల్లో సిద్ధిపేటలోనూ కాంగ్రెస్ గెలవాలి. ఇక్కడి నుంచి గెలిచిన వ్యక్తికి మంత్రి పదవి ఇస్తా. గత పాలకులు విపక్షనేతల నియోజకవర్గాల పట్ల వివక్ష చూపించారు. నేను నేతలతో వ్యతిరేకిస్తాను గానీ, ప్రజల పట్ల వివక్ష చూపను. సిద్ధిపేటకు కూడా నిధులు భారీగా ఇచ్చాను. వివక్ష చూపే వ్యక్తినయితే.. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని కొడంగల్‌కు తీసుకెళ్లేవాడిని. ప్రజలు బీఆర్‌ఎస్‌కు రెండుసార్లు అధికారం ఇచ్చారు.. మాకు రెండు సార్లు ఇస్తారు." అని రేవంత్ అన్నారు.

అంతకుముందు సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. 62 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో రూ.300 కోట్లతో ఈ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టారు. మరోవైపు రూ.80 కోట్లతో నర్మెటలో పామాయిల్ రిఫైనరీ ప్లాంట్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు.

# హైదరాబాద్‌ను మించేలా అమరావతి నిర్మాణం

మొదటి పేజీ తరువాయి

1999-2004 మధ్య హైదరాబాద్‌ను శరవేగంగా అభివృద్ధి చేశాం. అప్పట్లో నేను కృషి చేయడం వల్లే జినోమ్ వ్యాలీ వచ్చింది. అనేక కారణాల వల్ల 2004లో ఓడిపోయాం. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు పదేళ్లు పట్టింది. 2014 నుంచి 2019 వరకు ఏపీలో అనేక కార్యక్రమాలు చేపట్టాం. కేవలం అభివృద్ధిపైనే దృష్టి పెడితే ఎన్నికల్లో గెలవలేం. 2019 నుంచి 2024 మధ్య ఏపీలో అభివృద్ధి కుంటుపడింది. 2024లో మళ్లీ వచ్చాక అభివృద్ధి, సంక్షేమం అందిస్తున్నాం. ఇప్పుడు అనేక రంగాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉంది. 30 ఏళ్ల క్రితమే ఐటీ గురించి ఆలోచించా. ఏఐ, డేటా సెంటర్లు, క్వాంటమ్, స్పేస్ టెక్నాలజీ వచ్చాయి. డ్రోన్లు, ఎయిర్ అంబులెన్స్‌లు త్వరగా విస్తరిస్తున్నాయి. ప్రస్తుత యుద్ధాల్లో డ్రోన్ టెక్నాలజీ ఎలా ఉందో చూస్తున్నాం. విద్యుత్ సమస్యలను అధిగమించి మిగులు వరకు తీసుకొచ్చాం. సోలార్, విండ్, గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నాం. గ్రీన్ ఎనర్జీరంగంలో దక్షిణాదిలో మేమే నెంబర్‌వన్ " అని చంద్రబాబు అన్నారు.

# ఆర్సెల్లార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్.. ఉత్తరాంధ్రకు మరో మణిహారం: కలిశెట్టి

మొదటి పేజీ తరువాయి

అమరావతి: ఉత్తరాంధ్రలో అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. రూ.1.05 లక్షల కోట్లతో ఏర్పాటు కాబోతున్న ఆర్సెల్లార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్‌కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయబోతున్నట్లు చెప్పారు. ఆర్సెల్లార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్ ఉత్తరాంధ్రకు మరో మణిహారంగా నిలుస్తుందన్నారు. వైకాపా పాలనలో ఉత్తరాంధ్రను నిర్లక్ష్యం చేశారని, సీఎం చంద్రబాబు 20 నెలల్లో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి చూపించారని చెప్పారు. ఉత్తరాంధ్ర ద్రోహిగా జగన్ నిలిచిపోయారని విమర్శించారు.

# 25న కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తా: జీవన్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

జగిత్యాల: కాంగ్రెస్‌లో కొనసాగలేనంటూ జగిత్యాల కార్యకర్తలకు సీనియర్ నేత టి. జీవన్‌రెడ్డి లేఖ రాశారు. ఈ నెల 25న కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తానని అందులో పేర్కొన్నారు. గత 20 నెలలుగా పార్టీలో మానసిక క్షోభకు గురవుతున్నానని తెలిపారు. అవమానాలు భరిస్తూ పార్టీలో కొనసాగలేనని చెప్పారు. స్థానిక నేతలు, కార్యకర్తలతో సమావేశమై, అందరి సలహాలు, సూచనలతో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని లేఖలో పేర్కొన్నారు. 'నా రాజకీయ ప్రస్థానంలో మీ తోడు, మార్గదర్శనం కావాలి' అని కార్యకర్తలను కోరారు.


# హైదరాబాద్‌లో బాల్కనీ స్లాబ్ కూలి ఇద్దరి మృతి

మొదటి పేజీ తరువాయి

కుందన్ బాగ్ మెథడిస్ట్ కాలనీలోని శ్రీవాత్స అపార్ట్‌మెంట్ యజమాని ద్వారకాప్రసాద్ పనుల నిమిత్తం వారిని తన ఇంటికి పిలిపించాడు. ముగ్గురూ కలిసి మూడో అంతస్తుకు చేరుకొని పనుల గురించి మాట్లాడుతుండగా.. ఒక్కసారిగా బాల్కనీ స్లాబ్ కూలిపోయింది. దీంతో ముగ్గురూ కింద పడిపోయారు. దేవీదాస్, వివేక్ అక్కడికక్కడే మృతిచెందారు. ఇంటి యజమాని ద్వారకా ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మమత కంచుకోట.. ఒకప్పుడు కాంగ్రెస్‌దే హవా!

మొదటి పేజీ తరువాయి



కారణం.. ఇది ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సొంత నియోజకవర్గం కావడమే. పైగా ఈసారి భాజపా నేత సువేందు అధికారి సైతం ఇక్కడినుంచే పోటీకి దిగనున్నారు. ప్రస్తుతం దీదీకి కంచుకోటగా పేరున్న ఈ నియోజకవర్గంలో ఒకప్పుడు కాంగ్రెస్‌దే హవా. స్వాతంత్ర్యం అనంతరం దశాబ్దాలపాటు ఇక్కడ హస్తం పార్టీ నేతలదే పైచేయి.

బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి సిద్ధార్థ శంకర్ రే.. భవానీపుర్ నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలుపొందారు. మరోసారి స్వతంత్ర అభ్యర్థిగానూ ఆయన విజయం సాధించడం గమనార్హం. మీరాదత్తా గుప్తా, రథిన్ తాలుక్‌దార్ వంటి కాంగ్రెస్ దిగ్గజాలు కూడా ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు.

అనేక సంవత్సరాలపాటు కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగిన ఈ నియోజకవర్గం పేరును కాళీఘాట్‌గా మార్చారు. 1969 ఎన్నికల్లో సీపీఎం నేత సాధన్ గుప్తా గెలుపొందారు.

1972లో నియోజకవర్గాల పునర్విభజన అనంతరం.. ఈ నియోజకవర్గం కనుమరుగైపోయింది. మళ్లీ 2011లో డీలిమిటేషన్ తర్వాత భవానీపుర్ పేరిట పునర్వ్యవస్థీకరించారు. అదే ఏడాది జరిగిన శాసనసభ ఎన్నికల్లోనే బెంగాల్‌లో వామపక్షాల సుదీర్ఘ పాలనకు తెరదించుతూ టీఎంసీ అధికారంలోకి వచ్చింది. భవానీపుర్‌లో దీదీ విశ్వాసపాత్రుడు సుబ్రతా బక్షీ గెలుపొందారు కొద్దికాలానికే బక్షీ ఆ సీటును ఖాళీ చేశారు. అప్పటికే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మమతా బెనర్జీ.. ఇదే స్థానం నుంచి ఉప ఎన్నికలో గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెట్టారు. అప్పటినుంచి ఈ సీటు తృణమూల్ చేతుల్లోనే ఉంది. 2016లోనూ మమత 65 వేలకుపైగా ఓట్లతో విజయం సాధించారు.

పాలనలో.. మోదీ రికార్డు

2021లో నందిగ్రామ్ నుంచి పోటీ చేసిన మమత.. సువేందు అధికారి చేతిలో 1,956 ఓట్ల తేడాతో ఓడిపోయారు. భవానీపుర్‌లో మాత్రం టీఎంసీ అభ్యర్థి సోవందేబ్ ఛటోపాధ్యాయ విజయం సాధించారు. ఆయన రాజీనామా చేసిన అనంతరం జరిగిన ఉప ఎన్నికలో 58 వేలకుపైగా ఓట్ల మెజారిటీతో మమతా విజయం సాధించారు.

దక్షిణ కోల్‌కతాలోని ఈ అసెంబ్లీ నియోజకవర్గం సామాజిక వైవిధ్యానికి ప్రతిబింబంగా నిలుస్తోంది. ఇక్కడ బెంగాలీ మధ్యతరగతి కుటుంబాలతోపాటు పెద్ద సంఖ్యలో హిందీ మాట్లాడే వ్యాపార వర్గాలూ ఉన్నాయి. ఓటర్లలో బెంగాలీ హిందువులు దాదాపు 42 శాతం, బెంగాలీయేతర హిందువులు 34 శాతం, ముస్లింలు 24 శాతం ఉన్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలతో సీఎం మమతా బెనర్జీ వ్యక్తిగత రాజకీయ అనుబంధాన్ని ఏర్పరచుకున్నారని, స్థానిక సామాజిక వాతావరణం ఆమెకు అనుకూలంగా ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# రేపే జన్ ఆక్రోశ ర్యాలీ

**- విజయవంతం చేయండి : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో పిలుపు**

మేకార్తి దినపత్రిక, మార్చ్ 23 ప్రతినిధి
న్యూఢిల్లీ : ఈ నెల 24న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో సీపీఐ(ఎం) నిర్వహించే 'జన్ ఆక్రోశ్' ర్యాలీని విజయవంతం చేయాలని పొలిట్‌బ్యూరో పిలుపునిచ్చింది. ఉత్తరభారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ జరిగిన జన్ ఆక్రోశ్ జాతాల ముగింపు సందర్భంగా ఈ భారీ ర్యాలీని నిర్వహిస్తున్నట్టు వెల్లడించింది. ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేసింది. ఫిబ్రవరి 27 నుంచి ఈ నెల 20 మధ్య 33 జాతాలు జమ్మూకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా, రాజస్తాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాల్లో మొత్తం 213 రోజుల పాటు పర్యటించాయని వివరించింది. ఈ సందర్భంగా 1000కి పైగా బహిరంగ సభలు జరగ్గా, సుమారు లక్షా యాభై మంది ప్రజల హాజరైనట్టు పొలిట్‌బ్యూరో వెల్లడించింది. అలాగే దాదాపు 35 వేల పుస్తకాలు అమ్ముడు కాగా, పది లక్షల కరపత్రాలు పంపిణీ చేసినట్టు వివరించింది. జాతాలతో పాటు సాంస్కృతిక బృందాలు కూడా పర్యటించి, జాతాల సమయంలో లేవనెత్తిన సమస్యలను హైలైట్ చేస్తూ వీధి నాటకాలు, పాటలను ప్రదర్శించినట్టు పేర్కొంది. నాలుగు లేబర్ కోడ్‌ల నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని, వీబీ-జీఆర్‌ఏఎంజీని రద్దు చేయాలని, విద్యుత్ చట్టాన్ని, విత్తన బిల్లును సవరించవద్దని,



భారత్- అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీయే ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జన్ ఆక్రోశ్ జాతాలు, ర్యాలీని నిర్వహిస్తున్నట్టు పొలిట్‌బ్యూరో వివరించింది. ఈ జాతాల సందర్భంగా బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వపు విధానాలతో ప్రజలు పడుతున్న కష్టాల తీవ్రత మరోసారి వెలుగులోకి వచ్చిందని పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడుల ప్రభావం దేశవ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంది. వంటగ్యాస్, ఇంధన ధరల పెరుగుదల, గ్యాస్ సిలిండర్ల కొరత, పెరుగుతున్న ఆహార ధరలు, వ్యాపార సంస్థలు, వ్యాపారాలు పూర్తిగా లేదా పాక్షికంగా మూతపడటం వంటి సమస్యలు ప్రజల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని వివరించింది. ఈ కష్టాలపై ర్యాలీ గళం వినిపిస్తుందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. షహీది దివస్ జరిగిన మరుసటి రోజునే నిర్వహించనున్న ఈ ర్యాలీ కోసం ఉత్తరభార తదేశం నలుమూలల నుంచి ప్రజలను సమీకరిస్తున్నామనీ, ఈ ర్యాలీని ఉద్దేశించి సీపీఐ(ఎం) జాతీయ నాయకులు ప్రసంగిస్తారని, కార్యాచరణకు పిలుపునిస్తారని వివరించింది.

## నిరుపేద కుటుంబాలకు బీమా పథకాలు వరం: మాజీ ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య

మేకార్తి దినపత్రిక, మార్చ్ 23 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి



ప్రధానమంత్రి సురక్షిత బీమా యోజన (పి.ఎమ్.ఎస్.బి.వై), ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకం (పి.ఎమ్.జె.జె.బి.వై) దరఖాస్తు ఫారాలను కోనరావుపేట మాజీ ఎంపీపీ, ప్రముఖ సామాజిక రాజకీయవేత్త ఎదురుగట్ల చంద్రయ్య ఆవిష్కరించి, ప్రజలకు ఉచితంగా అందజేశారు. వెంకంపేటలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తక్కువ ప్రీమియంతో ఎక్కువ ఆర్థిక లాభం చేకూర్చే ఈ పథకాలు ఆపద సమయంలో నిరుపేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తాయన్నారు. కుటుంబ యజమానికి ఏదైనా ప్రమాదం జరిగినా లేదా మరణించినా, భార్యాపిల్లలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ఈ ఇన్సూరెన్స్ పాలసీలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాల ద్వారా నేరుగా అమలవుతున్న ఈ సామాజిక భద్రతా పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు అంబాల మల్లేశం, వేముల మార్కండేయులు, కల్లూరి శంకర్ మరియు వెంకంపేట గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో విద్య, ఉపాధి హక్కులకై పోరాడుదాం

**- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ రాజు గురు సుఖదేవుల 95వ వర్ధంతి**
**- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్**
**- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గాంతుల మహేష్**

మేకార్తి దినపత్రిక, మార్చ్ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి
రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం రోజున భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డివైఎఫ్ఐ) జిల్లా కమిటీల ఆధ్వర్యంలో భగత్ సింగ్




రాజ్ గురు సుఖదేవ్ ల వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది .ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గాంతుల మహేష్ లు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం అతి చిన్న వయసులోనే ఉరికంబాన్ని ముద్దాడిన మహనీయులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవులని అన్నారు వారి పోరాట స్ఫూర్తితో నేటి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై పోరాటం చేసి విద్య ఉపాధి హక్కులను సాధించుకోవాలని అన్నారు. దేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేశారని భగత్ సింగ్ బాటలోనే రాజు గురు సుఖదేవులు పయనించారని అన్నారు భగత్ సింగ్ కుటుంబ నేపథ్యం చిన్నప్పటినుంచి స్వాతంత్ర పోరాటంలో ఉన్నందున భగత్ సింగ్ చిన్నతనం నుంచే స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారు ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదంతో దేశ యువతను ఏకం చేసి స్వాతంత్ర ఉద్యమం వైపు నడిపించారని అన్నారు జలియన్ వాలాబాగ్, చౌరీ చౌర, సహాయ నిరాకరణ ఉద్యమం వంటి సంఘటనల ద్వారా బ్రిటిష్ పార్లమెంటుపై పొగ బాంబు వేసి ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదంతో బ్రిటిష్ ప్రభుత్వాన్ని భయపెట్టారని అన్నారు బ్రిటిష్ ప్రభుత్వం మార్చి 23న భగత్ సింగ్ రాజు గురు సుఖదేవులను ఉరితీసారని తెలిపారు వారి ఆశయ సాధన కోసం నేతి యువత విద్యార్థులు పాటుపడలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జాలపల్లి మనోజ్ కుమార్, శ్రీరాముల సంజన, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ ,కార్యదర్శి రమణ, ఐద్వా కార్యదర్శి విమల ,ఎస్ఎఫ్ఐ నాయకులు నవీన్, సతీష్, శివ, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిస్తాం.

**- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్.**
**- సీపీఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు.**

మేకార్తి దినపత్రిక మార్చి 23 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.



భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ అన్నారు. భగత్ సింగ్ 95వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం చేర్యాల పట్టణంలోని అంగడి బజారు షాదీఖాన ఫంక్షన్ హాల్ లో భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడిన భగత్ సింగ్ మండే అగ్ని గోళం జ్వలించే నిప్పుకణికలా రెపరెపలాడే విప్లవ పతాక భగత్ సింగ్ పేరు వింటేనే ప్రతీ భారతీయుడి రోమాలు నిక్కబొడుచేలా 23 ఏళ్ల వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ఉరికొయ్యను ముద్దాడిన గొప్ప వీరుడన్నారు. తన స్నేహితులు విప్లవ యోధులైన సుఖ్ దేవ్,రాజ్ గురు లతో పాటు అసువులు బాశాడని, నిరంకుశ బ్రిటిష్ ప్రభుత్వం వారి ముగ్గురిని వరుసగా నిల్చోబెట్టి ఉరి తీసిందన్నారు. దేశం కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్ స్ఫూర్తితో నేటి యువత ఆదర్శంగా తీసుకుని పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, జంగిలి యాదగిరి, సిపిఐ మండల కోశాధికారి నంగి కనకయ్య, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు గూడెపు సుదర్శన్, కొమురవెల్లి మండల సహాయ కార్యదర్శి బూరుగు సత్తయ్య గౌడ్, మహిళా సమాఖ్య డివిజన్ నాయకురాలు సుంకోజు రజిత, గూడెపు సంతోష, మల్లం అంజయ్య, ఆత్మకూరి హరికృష్ణ, బింగి పోషయ్య, శేఖర్, నవీన్,సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో ఉద్యోగుల ఖాతాలోకి డిఏ బకాయిలు మంత్రి భట్టి విక్రమార్క

**- అసెంబ్లీలో భట్టి విక్రమార్క కీలక ప్రకటన!**

మేకార్తి దినపత్రిక, మార్చ్ 23 ,హైదరాబాద్
తెలంగాణ అసెంబ్లీ వేదిక గా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమంపై కీలక ప్రసంగం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూనే, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా జీతాల చెల్లింపు, పెండింగ్ డీఏలు, మరియు హెల్త్ కార్డులపై ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాం శమయ్యాయి. గత ప్రభుత్వం సుమారు 40,150 కోట్ల రూపాయల బకాయిలను పెట్టి వెళ్లిం దని, అందులో ఉద్యోగుల పెండింగ్ బిల్లులే 4,575 కోట్లు ఉన్నాయని భట్టి వెల్లడించారు. అయిన ప్పటికీ, తమ ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే 6,146 కోట్ల రూపాయల బకాయి లను క్లియర్ చేశామని ఆయన గర్వంగా ప్రకటించారు.

**భట్టి ప్రసంగంలోని ముఖ్యాంశాలు:**
ఉద్యోగులు గతంలో 15వ తేదీ వరకు జీతాల కోసం ఎదురు చూసే పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు ప్రతి నెల 1వ తేదీనే ఉద్యోగుల ఖాతాల్లో జీతాలు వేస్తున్నామని తెలిపారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల కోసం ప్రతి నెలా 700 కోట్లు చెల్లిస్తున్నామని, త్వరలోనే ఈ



మొత్తాన్ని 1,000 కోట్లకు పెంచే ఆలోచనలో ఉన్నట్లు భట్టి పేర్కొన్నారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న హెల్త్ కార్డుల డిమాండ్‌ను నెరవేరుస్తూ, త్వరలోనే ఉద్యోగులకు పూర్తి స్థాయి నగదు రహిత వైద్య చికిత్స కార్డులను అందుబాటు లోకి తెస్తామన్నారు. ప్రమాదవశాత్తు ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబానికి 1.25 కోట్ల రూపాయల ప్రమాద బీమా అమలు చేయబోతున్నట్లు ప్రకటించారు. కొత్త పీఆర్సీ నివేదిక రాగానే అమలుపై నిర్ణయం తీసుకుంటామని, పెండింగ్ లో ఉన్న 4 డీఏలపై కూడా సానుకూల నిర్ణయం ఉంటుందని హామీ ఇచ్చారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేకనే గత ప్రభుత్వం ఉద్యోగుల పద వీ విరమణ వయస్సును పెంచింది అని భట్టి విమర్శించారు. దీనివల్ల 17 వేల మంది ఉద్యోగుల రిటైర్మెంట్ ప్రయోజనాల భారం ఇప్పుడు తమ ప్రభుత్వంపై పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉద్యోగ సంఘాల పై ఆంక్షలు ఉండేవని, ఇప్పుడు సీఎం, డిప్యూటీ సీఎంలను కలిసే స్వేచ్ఛ అందరికీ ఉందని ఆయన స్పష్టం చేశారు.

## బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం నిర్మల్‌లో టీఆర్పి ఆందోళన

మేకార్తి దినపత్రిక,నిర్మల్



2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ వర్గాలకు రావలసిన నిధులను సరైన విధంగా కేటాయించకుండా, తక్కువ శాతం ఉన్న వర్గాలకు అధికంగా కేటాయించారని ఆరోపిస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు...నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలోజిల్లా అధ్యక్షులు గైని సాయి మోహన్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 60 శాతం జనాభా కలిగిన బీసీలకు కేవలం 6 శాతం బడ్జెట్ మాత్రమే కేటాయించడం తీవ్ర అన్యాయం అని విమర్శించారు. అదే సమయంలో, కేవలం 6 శాతం జనాభా ఉన్న వర్గాలకు 60 శాతం వరకు నిధులు కేటాయించడం ప్రభుత్వపు పక్షపాత విధానాన్ని సూచిస్తోందని మండిపడ్డారు. ఈ నిరసన కార్యక్రమంలో టిఆర్పి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీసీలకు తగిన న్యాయం చేయాలని, వారి జనాభాకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని పున పరిశీలించి, బీసీ వర్గాలకు సముచితమైన వాటాను కేటాయించకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరింత పెద్ద స్థాయిలో ఆందోళనలు చేపడతామని టిఆర్పి నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జెట్లోడ్ శంకర్, రాజన్న ,భోజన్న తదితరులు పాల్గొన్నారు

# రైతుల ముఖాల్లో ఆనందం చూడడమే రైతు పక్షపాతి సిఎం రేవంత్ రెడ్డి ధ్యేయం

**- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోమ్మాటి నరసయ్య**
**- తొలి విడత ఎకరా వరకు భూమి ఉన్న రైతులకు రైతు భరోసా నిధులు జమ**
**- సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం**

మేకార్తి దినపత్రిక, ఎల్లారెడ్డిపేట మార్చి 23 :
రైతుల ముఖాల్లో ఆనందం చూడడమే రైతు పక్షపాతి అయిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్యేయమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోమ్మాటి నరసయ్య రైతు జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు మర్రి శ్రీనివాసరెడ్డి లు అన్నారు, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పాత బస్టాండులో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి సోమవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాలాభిషేకం చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలి విడత రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ. 6 వేలు చొప్పున రైతుల బ్యాంక్ అకౌంట్‌లలో ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి ఎకరా వరకు భూమి ఉన్న రైతులకు సిద్దిపేట జిల్లా నర్మెటలో లో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ప్రారంభించిన సందర్భంగా రైతు భరోసా నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ చేసినందుకు వారు సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు,రాష్ట్రవ్యాప్తంగా 68,89,955 మంది రైతులకు సంబంధించి మొత్తం 57.44 లక్షల ఎకరాలకు రూ.3,446.94 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు, అకౌంట్‌లలో రైతు భరోసా పథకం కింద మొత్తం రూ. 9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ



చేయనున్నారు. తొలి విడతలో ఎకరా వరకు భూమి ఉన్న రైతులకు రైతు భరోసా నిధులు జమ కానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఏం సి వైస్ ప్రెసిడెంట్ గుండాడి రామిరెడ్డి, సర్పంచులు బాపురెడ్డి కిషన్ , ఉప సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, ఏ ఎం సి డైరెక్టర్ గుల్లపల్లి లక్ష్మారెడ్డి, గణపతి నాయక్ సూడిది రాజేందర్ పట్టణ అధ్యక్షులు చెన్ని బాబు కాంగ్రెస్ పార్టీ నాయకులు చేపూరి రాయిశం గుప్తా రాములు బండారి బాల్రెడ్డి నంది కిషన్ గోగూరి శ్రీనివాస్ రెడ్డి సాయి ప్రేమ్ గుర్రాల రాజిరెడ్డి రెడ్డి సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు కుంభాల సుధాకర్ రెడ్డి సిరిపురం మహేందర్ సంతోష్ జనార్ధన్ వంగ శ్రీకాంత్ రెడ్డి సూర వెంకటీ , ఎల్లా గౌడ్ బాలచందర్ యాదవ్, ఇమామ్ బాయి చందు జంగ బుచ్చిరెడ్డి బాబాన్న , కస్తూరి ప్రవీణ్ రెడ్డి , గ్రామ శాఖ అధ్యక్షులు సత్యనారాయణ రమేష్ గౌడ్ గుడ్ల శ్రీనివాస్ సోషల్ మీడియా ప్రతినిధి ఇలియాస్ బాబా తదితరులు పాల్గొన్నారు,

## ఢిల్లీలా మారొద్దు హైదరాబాద్ అభివృద్ధికి మెగా ప్లాన్




మేకార్తి దినపత్రిక, మార్చ్ ఢిల్లీ
దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, బెంగళూరులు కాలుష్యం, వరదలు, ట్రాఫిక్తో ఇబ్బంది పడుతున్నాయని, ఆ పరిస్థితి మన హైదరాబాద్కు రాకుండా తెలంగాణ రైజింగ్ 2047 ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు సీఎం రేవంత్ శాసనమండలిలో తెలిపారు. రాష్ట్రాన్ని క్యూర్ (సేవలు), ప్యూర్ (తయారీ), రేర్ (వ్యవసాయం) అనే మూడు జోన్లుగా విభజించామన్నారు. కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించి, కోర్ అర్బన్ ప్రాంతాన్ని నివాసయోగ్యంగా, స్మార్ట్ గవర్నెన్స్తో తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

## వరి సేకరణపై అసెంబ్లీలో
# పల్లా రాజశేఖర్ రెడ్డి ఫైర్.

- రికార్డు సేకరణ ఎక్కడ?
- వరి సేకరణలో ఆలస్యమెందుకని ఆగ్రహం.
- బోనస్, బకాయిలు వెంటనే ఇవ్వాలి.
- రైతుల కష్టాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పల్లా రాజేశ్వర్ రెడ్డి.

మేకార్తి దినపత్రిక మార్చి 23 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.




రాష్ట్రవ్యాప్తంగా ఎదురు చూస్తున్న రైతుల వరి సేకరణ అంశంపై అసెం బ్లీలో సోమవారం జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి గారు తీవ్రంగా ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో వరి కొనుగోళ్లపై ప్రభుత్వం చెప్పే గణాంకాలు, వాస్తవ పరిస్థితులు మధ్య వ్యత్యాసం ఉంది..రికార్డు స్థాయిలో వరి సేకరణ చేశామని చెబుతున్న ప్రభుత్వం, ఆ రికార్డు ఎక్కడ? అని పల్లా ప్రశ్నించారు. కొనుగోళ్లలో ఉన్న అసలు నిజాలను బయటపెట్టారు. వరి సేకరణలో ఆలస్యం ఎందుకు జరుగు తోందని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం 50 లక్షల టన్నుల వరి కొనుగోలుకు అనుమతి ఇచ్చిందని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డిని మిగిలిన వరి పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. రైతులకు చెల్లించాల్సిన బోనస్, బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న కష్టా లను అర్థం చేసుకుని తక్షణ చర్యలు తీసుకో వాలని ప్రభుత్వాన్ని పల్లా రాజేశ్వర్ రెడ్డి కోరారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- 167 అర్జీల రాక

మేకార్తి దినపత్రిక,మార్చి 23 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి




సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి.. ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించి.. పరిష్కారానికి ఆదేశించారు. మొత్తం 167 అర్జీల రాగా, సంబంధిత అధికారులకు అందజేశారు.రెవెన్యూ శాఖకు 62, గృహ నిర్మాణ శాఖకు 28, డీఆర్డీఓకు -- 19, జిల్లా పంచాయతీ కార్యాలయం 9, ఉపాధి కల్పన అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎస్పీ కార్యాలయానికి 5 చొప్పున, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కు 4, జిల్లా విద్యాధికారి, జిల్లా వైద్యాధికారి, జిల్లా సంక్షేమ శాఖ, నీటి పారుదల శాఖ, సెస్ ఎండీకి 3 చొప్పున, జిల్లా పౌర సరఫరాల శాఖ, మైనింగ్ శాఖ అధికారి, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయం, లీడ్ బ్యాంక్ మేనేజర్ కు 2 చొప్పున, మత్స్య శాఖ అధికారి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి, ఈడీఎం, ఈఈ ఆర్ అండ్ బీ, మిషన్ భగీరథ, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, సబ్ రిజిస్టర్ సిరిసిల్లకు ఒకటి చొప్పున వచ్చాయి. వాటిని సంబంధిత కార్యాలయాలకు పంపించారు.

ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాబాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఇది కొన్ని యుగాల చరిత్ర కలిగిన పురాతన దేవాలయం

మేకార్తి దినపత్రిక, మార్చ్ ప్రతినిధి



మన తెలంగాణ రాష్ట్ర జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం పోతారం గ్రామంలో అనాది కాలంలో రాముడు సంచరిస్తున్న యుగంలో రాముడు శివలింగానికి పూజ చేయాలని నీటి కోసం వెతుకుతుండగా అడవిలో ఏదో అలికిడి వినిపించి బానాన్ని వేయ సాగాడు అందులో ఒక బాణం బండకు తగిలి ఆ బండ పొరల్లో నుండి నీటి దారలు రావడం గమనించిన రాముడు ఆ నీటితో శివలింగానికి అభిషేకం చేశాడు వాస్తవానికి లొంకా రామన్న దేవాలయం అని ఆ దేవాలయానికి పేరు వచ్చింది కానీ వాస్తవానికి అక్కడ వెలిసింది మహిమగల శివలింగం ఆ పచ్చని కొండ ప్రాంతానికి వెళితే మనసు నిశ్చలంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆధ్యాత్మికత ఉట్టిపడే కొత్త లోకానికి వచ్చామా అన్నట్టు ఆశ్చర్యానికి లోనైతాము. ముఖ్య విషయం ఏమనగా ఆ నీటి దారల గురించి ఆ గ్రామస్తులు చెబుతున్నది ఏమిటంటే, ఈ కొండల మధ్య ఇలాంటి డ్యామ్ కానీ, కాలువలు కానీ ఏమీ లేవు, పురాతన కాలం నుండే, ఈ బండల మధ్యలో నుండి నీరు ఎలా వస్తుంది అనేదానికి ఆధారం ఆ కాలంలో రాముడు వేసిన బాణం బండకు తగిలి నీటి దారలు రావడం ఒక అద్భుతమైన మహిమ అని చెప్పుకోవాలని ఈ గ్రామ ప్రజలు చెబుతున్నారు మీరు కూడా లొంక రామేశ్వర స్వామి దేవాలయం దర్శించుకోండి చూసి తరించండి

# తెలంగాణకు ఆయిల్ ఫామ్ స్వర్ణ యుగం.

మేకార్తి దినపత్రిక మార్చి 22 జిల్లా ఇంచార్జ్ పాపని స్వామి ప్రతినిధి



మంత్రి తుమ్మల విజన్ – జంగా రాఘవ రెడ్డి గారి సమన్వయం. తెలంగాణ ఆయిల్ పామ్ స్వర్ణ యుగం.?తెలంగాణ వ్యవసాయ ముఖచిత్రాన్ని మార్చాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్గదర్శకత్వం మరియు జంగా రాఘవ రెడ్డి కార్యదక్షత ఒక విజయవంతమైన జోడీగా నిలుస్తున్నాయి.సమన్వయ శిఖరం – జంగా రాఘవ రెడ్డి ప్రత్యేకతలు.మంత్రి తుమ్మల ఆశయాలకు కార్యరూపం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు నిర్దేశించిన 20 లక్షల హెక్టార్ల ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవడంలో, జంగా రాఘవ రెడ్డి గారు ఆయిల్ ఫెడ్ యంత్రాంగాన్ని ఒక క్రమశిక్షణ గల సైన్యంలా నడిపిస్తున్నారు.ప్రభుత్వ విధానం .క్షేత్రస్థాయి అమలు. మంత్రి గారి విజన్ ప్రకారం రైతులకు అందాల్సిన సబ్సిడీలు, విత్తన మొక్కలు మరియు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎక్కడా ఆలస్యం కాకుండా నేరుగా రైతు గడపకు చేర్చడంలో జంగా గారు అద్భుతమైన సమన్వయకర్తగా నిరూపించుకున్నారు. నిరంతర పర్యవేక్షణ – రికార్డు స్థాయి నిర్మాణం:.నర్మేట కర్మాగారం వంటి భారీ ప్రాజెక్టులను మంత్రి తుమ్మల గారి పర్యవేక్షణలో, జంగా రాఘవ రెడ్డి అహర్నిశలు శ్రమించి నిర్ణీత గడువులోపు పూర్తి చేయించడం వారి పనితీరుకు నిదర్శనం.?శాస్త్రవేత్తలు – రైతుల మధ్య వారధి: రామచంద్రుడు, సుబ్బన్న వంటి ప్రముఖ శాస్త్రవేత్తల పరిశోధనా ఫలితాలను సామాన్య రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించడానికి, ఆయిల్ ఫెడ్ సిబ్బందిని ఎప్పటికప్పుడు సన్నద్ధం చేస్తూ సమన్వయం చేస్తున్నారు.?రాజకీయ చాణక్యం రైతు సంక్షేమం : కేవలం ఒక చైర్మన్ గానే కాకుండా, రాజకీయంగా కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంత్రి తుమ్మల . అత్యంత నమ్మకస్తుడైన నేతగా ఉంటూ.ప్రభుత్వ ఫలాలను రైతాంగానికి అందజేయడంలో జంగా రాఘవ రెడ్డి ఒక బలమైన శక్తిగా నిరుపించుకుంటున్నారు.? త్వరితగతిన చెల్లింపుల వ్యవస్థ : మంత్రి ఆదేశాల మేరకు, పంట అమ్మిన 3 రోజుల్లోనే రైతు ఖాతాల్లో నగదు జమ అయ్యేలా పారదర్శకమైన డిజిటల్ వ్యవస్థను పకడ్బందీగా అమలు చేస్తున్నారు.? మంత్రి తుమ్మల గారి మార్గదర్శకత్వంలో.జంగా రాఘవ రెడ్డి గారి సారథ్యంలో.తెలంగాణ ఆయిల్ పామ్ సాగు దేశానికే ఆదర్శం

# బడ్జెట్ లో బీసీలకు మొండి చేయి చూపిన రెడ్డి ప్రభుత్వం పై మండిపడ్డ టీఆర్పీ

- నర్సాపూర్ లో టిఆర్పి నిరసన గర్జన

మేకార్తి దినపత్రిక, మార్చ్ మెదక్ జిల్లా



మెదక్ జిల్లా:తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 20267 బడ్జెట్ లో బీసీ వర్గాలకు జరిగిన ఘోర అన్యాయంపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ నర్సాపురం నియోజకవర్గ కమిటీ తీవ్ర మండిపడింది పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపుమేరకు...నర్సాపూర్ నియోజవర్గంలో రాష్ట్ర కార్యదర్శి నగేష్ ముదిరాజ్ మరియు జిల్లా అధ్యక్షులు ఇమాంపురం యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్ర జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు బడ్జెట్లో నామమాత్రపు కేటాయింపులు కూడా చేయకపోవడం దురదృష్టకరమని వారు ధ్వజమెత్తారు.కామారెడ్డి డిక్లరేషన్ ఎన్నికల సమయంలో బీసీల ఓట్ల కోసం 'కామారెడ్డి డిక్లరేషన్' పేరుతో అబద్ధపు హామీలిచ్చి, ఇప్పుడు బడ్జెట్లో మొండిచేయి చూపించారని విమర్శించారు.నిధుల లేమి: బీసీ కార్పొరేషన్లు నిధులు లేక వెలవెలబోతుంటే, ప్రభుత్వం మాత్రం కాలయాపన చేస్తోందని ఆరోపించారు.హక్కుల దోపిడీ: ఇది కేవలం నిర్లక్ష్యం కాదు, బీసీలపై జరుగుతున్న స్పష్టమైన అన్యాయమని, వారి హక్కులను దోచుకుంటున్నారని మండిపడ్డారు.బీసీల అభివృద్ధి కోసం తక్షణమే ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు న్యాయం జరిగే వరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ పోరాటం ఆగదని, రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారుఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రాములు ముదిరాజ్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు కమలయ్య గారి సురేష్ ముదిరాజ్ నర్సాపూర్ మండల అధ్యక్షుడు కురుమ ఆనంద్ జిల్లా యూత్ అధ్యక్షులు పోతుల రవీందర్ జిల్లా యూత్ ఉపాధ్యక్షులు అనిల్ కుమార్ జిల్లా మహిళా అధ్యక్షురాలు సిద్ధక్క జిల్లా నాయకులు నాగభూషణం చేగుంట మండల అధ్యక్షుడు సిద్దా గౌడ్ ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ బోనాల గ్రామ అధ్యక్షులు పోచయ్య కౌడిపల్లి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గన్ పూర్ మండల అధ్యక్షుడు బాబు కొల్చారం నాయకులు ప్రేమ్ దాస్ పంపల్లి సురేష్ హత్నూర నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆప్టిట్యూడ్ రీజనింగ్ పైన ఫైనలియర్ విద్యార్థులకు శిక్షణ

మేకార్తి దినపత్రిక మార్చి 23 గంభీరావుపేట మండల రిపోర్టర్



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో టాస్క్ మరియు కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు అప్టిట్యూడ్ మరియు రీజనింగ్ పైన శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. టాస్క్అండ్ కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ జె శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపల్ గారు మాట్లాడుతూ ఫైనలియర్ విద్యార్థులందరూ కూడా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని,అప్టిట్యూడ్ రీజనింగ్ అనేది ఐసెట్ కు మాత్రమే కాకుండా గ్రూప్ వన్ గ్రూప్ టు స్టాఫ్ సెలక్షన్ కమ్యూనికేషన్ బ్యాంకింగ్ వంటి ఎగ్జామ్స్ కి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. టాస్క్ కో ర్డినేటర్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం తో విద్యార్థులు కోడింగ్ డీకోడింగ్ చేయడం, పజిల్స్ తొందరగా చేయడం, షార్ట్ కట్స్ మెథడ్స్ ను ఉపయోగించి తొందరగా ప్రాబ్లం సాల్వ్ చేయడం నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ గా మ్యాజిక్ బస్సు నాంది ఫౌండేషన్ నుండి పి. సాగర్ బాబు విద్యార్థులకు ఆప్టిట్యూడ్ ఆప్టిట్యూడ్ రీజనింగ్ పైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చాలా అంశాలపై వివ వివరణలు ఇచ్చారు. ఉదాహరణలతో అన్వయించి చెప్పారు. దాదాపు 50 నుంచి 60 మంది విద్యార్థులు పాల్గొని రిసోర్స్ పర్సన్ ద్వారా అప్టిట్యూడ్ మరియు రీసనింగ్ పైన డౌట్స్ ను నివృత్తి చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ వీ.ప్రభాకర్,డాక్టర్ వై ఆంజనేయులు పాక ధర్మపురి, అడివిష్ణు, వాణి, మనోహర్ శ్రీనివాస్ , బిక్షమయ్య, సుచరణ్, కృష్ణ ప్రసాద్ తదితర అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు

# బడ్జెట్ లో బీసీలకు మొండి చేయి చూపిన రెడ్డి ప్రభుత్వం పై మండిపడ్డ టీఆర్పీ

- నర్సాపూర్ లో టిఆర్పి నిరసన గర్జన

మేకార్తి దినపత్రిక, మార్చ్ మెదక్ జిల్లా



మెదక్ జిల్లా:తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 20267 బడ్జెట్ లో బీసీ వర్గాలకు జరిగిన ఘోర అన్యాయంపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ నర్సాపురం నియోజకవర్గ కమిటీ తీవ్ర మండిపడింది పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపుమేరకు...నర్సాపూర్ నియోజవర్గంలో రాష్ట్ర కార్యదర్శి నగేష్ ముదిరాజ్ మరియు జిల్లా అధ్యక్షులు ఇమాంపురం యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్ర జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు బడ్జెట్లో నామమాత్రపు కేటాయింపులు కూడా చేయకపోవడం దురదృష్టకరమని వారు ధ్వజమెత్తారు.కామారెడ్డి డిక్లరేషన్ ఎన్నికల సమయంలో బీసీల ఓట్ల కోసం 'కామారెడ్డి డిక్లరేషన్' పేరుతో అబద్ధపు హామీలిచ్చి, ఇప్పుడు బడ్జెట్లో మొండిచేయి చూపించారని విమర్శించారు.నిధుల లేమి: బీసీ కార్పొరేషన్లు నిధులు లేక వెలవెలబోతుంటే, ప్రభుత్వం మాత్రం కాలయాపన చేస్తోందని ఆరోపించారు.హక్కుల దోపిడీ: ఇది కేవలం నిర్లక్ష్యం కాదు, బీసీలపై జరుగుతున్న స్పష్టమైన అన్యాయమని, వారి హక్కులను దోచుకుంటున్నారని మండిపడ్డారు.బీసీల అభివృద్ధి కోసం తక్షణమే ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు న్యాయం జరిగే వరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ పోరాటం ఆగదని, రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారుఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రాములు ముదిరాజ్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు కమలయ్య గారి సురేష్ ముదిరాజ్ నర్సాపూర్ మండల అధ్యక్షుడు కురుమ ఆనంద్ జిల్లా యూత్ అధ్యక్షులు పోతుల రవీందర్ జిల్లా యూత్ ఉపాధ్యక్షులు అనిల్ కుమార్ జిల్లా మహిళా అధ్యక్షురాలు సిద్ధక్క జిల్లా నాయకులు నాగభూషణం చేగుంట మండల అధ్యక్షుడు సిద్దా గౌడ్ ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ బోనాల గ్రామ అధ్యక్షులు పోచయ్య కౌడిపల్లి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గన్ పూర్ మండల అధ్యక్షుడు బాబు కొల్చారం నాయకులు ప్రేమ్ దాస్ పంపల్లి సురేష్ హత్నూర నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలు కుటుంబానికి కంఠారెడ్డి చేయూత.

మేకర్తి దినపత్రిక మార్చి 22 మెదక్ జిల్లా నిజాంపేట్ మండలం రిపోర్టర్ రాము.



మెదక్ జిల్లా నిజాంపేట్ మండలం కల్వకుంట గ్రామాన్ని కి చెందిన ముష్టి పోచవ్వ చనిపోవడం జరిగింది. గ్రామ సర్పంచ్ అందే కొండల్ రెడ్డి ద్వారా మరణించినా విషయం తెలుసుకొని బిఆర్ ఎస్ జిల్లా నాయకులు కంఠా రెడ్డి తిరుపతి రెడ్డి గారు 5000/రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమం లో గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ కొమురయ్య, ఉపసర్పంచ్ శ్యామల శివరామ్, వార్డ్ మెంబర్లు మహిపాల్ , తిరుపతి, హాజి లక్ష్మణ్ ,గ్రామ పెద్దలు ఎల్లయ్య ,కిష్టయ్య, అశోక్, శ్రీను,యువజన నాయకులు రాము పాల్గొన్నారు

## వడ్డెర సంఘం నిర్మాణానికి భూమి పూజ చేసిన చిప్పలపల్లి సర్పంచ్ మాచెట్టి లచ్చయ్య

మేకార్తి దినపత్రిక, మార్చ్ 23 ముస్తాబాద్ రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని చిప్పలపల్లి గ్రామంలో వడ్డెర సంఘం భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ కొబ్బరికాయలు కొట్టిభూమి పూజ చేసి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,గ్రామ సమస్యలు ఉన్నప్పటికీ అభివృద్ధిలో భాగంగా ముందుకు తీసుకెళ్తానని అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. భవన నిర్మాణానికి సహకరించి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



## భగతసింగ్ విగ్రహానికి ఘన నివాళి అర్పించడం జరిగింది



మేకార్తి దినపత్రిక మర్చి 23 కరీంనగర్ రూరల్ రిపోర్టర్ విజయ్ మోహన్ రెడ్డి
ఆంగ్లేయుల పాలన నుండి భారతదేశ విముక్తికి తమ ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా లక్షలాది మంది భారతీయులకు ప్రేరణ ఇచ్చిన మహనీయులు షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు ,సుఖ్ దేవ్, ల 95వర్ధంతి సందర్భంగా భగత్ నగర్ భగత్ సింగ్ చౌరస్తాలో నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించడం జరిగింది

## ఈమెయిల్ ద్వారా బెదిరింపులు

**- స్వాడ్ డాగ్ విస్తృతంగా తనిఖీ**
**- సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో**



మేకార్తి దినపత్రిక, మార్చ్ 23 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి
సిరిసిల్ల టౌన్ పి. యస్. రాజన్న సిరిసిల్ల జిల్లా కోర్టుకు ఈరోజు ఇమెయిల్ ద్వారా బెదిరింపు సందేశాలు రావడంతో కోర్టు అధికారులు పోలీస్ వారికి సమాచారం అందించగా వెంటనే జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. వెంటనే ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టి,కోర్టు భవనాల్లో ఉన్న న్యాయమూర్తులు,సిబ్బంది, న్యాయవాదులు,కక్షిదారులను సురక్షితంగా బయటకు తరలించారు. అనంతరం పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో కలిసి కోర్టు ప్రాంగణంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీలలో ఎలాంటి పేలుడు పదార్థాలు లభించక పొగ ఈబెదిరింపు సందేశాలు ఫేక్‌గా నిర్ధారించారు ఇదే విషయంలో కోర్ట్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సత్యనారాయణ మూర్తి గారి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంబించినట్లు సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

## బీసీలకు విద్యార్థులకు మొండిచేయి

**- హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ**
**- బడ్జెట్ ఓయూలో టి ఆర్ వి ఎస్ నిరసన**

మేకార్తి దినపత్రిక, మార్చ్ 23 ప్రతినిధి
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్ బీసీలను, విద్యార్థులను నిలువునా వంచించిందని తెలంగాణ రాజ్యాధికార విద్యార్థి సేన (ు=ఖూ) రాష్ట్ర అధ్యక్షుడు రాజు గౌడ్ మండిపడ్డారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు సోమవారం ఉస్మానియా యూనివర్సిటీలో ు=ఖూ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాజు గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు జరిగిన అన్యాయాన్ని తీవ్రంగా తప్పు బట్టారు ఎన్నికల సమయంలో కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక దానిని పూర్తిగా తుంగలో తొక్కిందని విమర్శించారు. రాష్ట్రంలో 56 శాతం ఉన్న బీసీ జనాభాకు కేవలం రూ. 12,511 కోట్లు మాత్రమే కేటాయించడం అంటే బీసీలను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ సబ్ ప్లాన్ ప్రకారం రూ. 20,000 కోట్లు కేటాయించాల్సి ఉండగా, ఆ ఊసే ఎత్తలేదని ఎత్తలేదని దుయ్యబట్టారు. జనాభాలో 10 శాతం కూడా లేని అగ్రకులాల మంత్రుల చేతిలో ఉన్న శాఖలకు 51 శాతం బడ్జెట్ కేటాయించి, బహుజన వర్గాలకు తీవ్ర అవమానం చేశారని ఆరోపించారు. బడ్జెట్‌లో విద్యార్థుల సంక్షేమానికి, విద్యారంగానికి సరైన నిధులు కేటాయించకపోవడం వల్ల పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు, విద్యార్థులకు జరుగుతున్న ఈ అన్యాయంపై తమ పోరాటం ఆపేది లేదని, ప్రభుత్వం తక్షణమే బడ్జెట్ కేటాయింపులను సమీక్షించాలని రాజు గౌడ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ు=ఖూ నాయకులు మరియు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ



మేకార్తి దినపత్రిక, మార్చి - 23 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి
రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని గీతా నగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఏ, బీ వింగ్ పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా పరిశీలించారు సౌకర్యాలను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు.

## పదో తరగతి పరీక్షా కేంద్రాలు తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్




మేకార్తి దినపత్రిక కరీంనగర్ టౌన్ రిపోర్టర్,మంద జయ ప్రకాష్ రెడ్డి మార్చి, 23.
కరీంనగర్ సప్తగిరి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తిరుమల నగర్ లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహిస్తున్న ఇంగ్లీష్ పరీక్షల సరళిని పరిశీలించారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులు సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, ప్రథమ చికిత్స, మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. తరగతి గదిలో తగిన వెంటిలేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి చిన్న తప్పిదానికి అవకాశం ఇవ్వకుండా విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**అడిషనల్ కలెక్టర్ తనిఖీ**
హౌసింగ్ బోర్డు కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(కుమర్వాడి), సుభాష్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే తనిఖీ చేశారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు తగిన సూచనలు చేశారు. పదవ తరగతి పరీక్షలు పక్కాగా నిర్వహించాలని, ఎక్కడా తప్పులు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.
పరీక్షా కేంద్రాల్లో వసతులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

## ప్రమాదకరమైన డ్రైనేజీ సమస్య పరిష్కారం


**- అభివృద్ధి బాటలో సర్పంచ్ బైతి దుర్గమ్మ**

మేకార్తి దినపత్రిక, మార్చు 23 ముస్తాబాద్
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల తెర్లుమద్ది గ్రామంలో బాధవేణి నారాయణ ఇంటి వద్ద ఉన్న డ్రైనేజీ సమస్య గత 10 సంవత్సరాలుగా కొనసాగుతోంది.



ఈ కారణంగా అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ మార్గంలో వెళ్లే ట్రాక్టర్లు పలుమార్లు బోల్తా పడిన సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. ఈ సమస్యను గ్రామ ప్రజలు నూతనంగా ఎన్నికైన సర్పంచ్ బైతి దుర్గమ్మ కి మరియు పాలకవర్గం దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే స్పందించి, సమస్యను పరిష్కరించారు. దీంతో కాలనీ నివాసులు ఆనందం వ్యక్తం చేస్తూ సర్పంచ్ కి మరియు పాలకవర్గానికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## ఇచ్చిన హామీలను కాంగ్రెస్ వెంటనే అమలు చేయాలి: రామచందర్‌రావు



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 26 నెలలు పూర్తవుతున్నా, ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను పూర్తిగా విస్మరించిందని తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా భాజపా ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల్లో ప్రజలకు ఒక్కటి కూడా చేరడం లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప.. మిగతా గ్యారంటీలన్నీ పక్కనబెట్టి, అమలు చేసినట్లు అబద్ధపు ప్రచారం చేస్తోందన్నారు. "రాష్ట్రంలో రైతులకు రైతు భరోసా కింద ఇంకా ఎకరానికి రూ.45 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. దాదాపు రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో విద్యాసంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయి. విద్యార్థుల భవిష్యత్ అనిశ్చితిలో పడింది. నిరసన చేస్తామని తెలిసి అర్ధరాత్రి నుంచే భాజపా నాయకులను గృహనిర్బంధం చేశారు. వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వస్తున్న వేలాది కార్యకర్తలను మార్గమధ్యంలోనే అడ్డుకుని అరెస్టు చేశారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నా" అని రామచందర్‌రావు అన్నారు. ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలు, హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

PRINTED,PUBLISHED & OWNED BY MEKARTHI SRINIVAS, Printed at SUNDAY PRINTING PRESS, H.No. 3-4297, SARASWATHI COMPLEX,SVN COLONY GUNTUR,ANDHRA PRADESH-522006.& Published from H.No. 12-166, RAJIV NAGAR,MUSTABAD, RAJANNA SIRICILLA DISTRICT-505404 TELANAGNA,.
RNI No.TGTEL /25/A2356,Editor : MEKARTHI SRINIVAS, Cell: 9014726022.e-mail: MEKARTHI DINAPATRIKA@gmail.com